## క్లుప్తంగా

### వీకేఆర్‌లో తుపాకులగూడెం చిత్ర బృందం సందడి



**కేసరపల్లి(గన్నవరం):** మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో సోమవారం తుపాకుల గూడెం చిత్ర యూనిట్ సందడి చేసింది. ఫిబ్రవరి 3వ తేదీన రిలీజ్ కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా నటీనటులు శ్రీకాంత్ రాథోడ్, ప్రవీణ్ కండెల, జైత్రి మకాన, చిత్ర దర్శకులు జైదీప్ విష్ణుతో పాటు చిత్ర బృందం ఇక్కడికి వచ్చారు. విద్యార్థులతో సినిమా ముచ్చట్లను పంచుకున్నారు. అటవీ ప్రాంతంలో పోలీసులకు నక్సలైట్లకు మధ్య జరిగే పోరాటం వల్ల గూడెం ప్రజలు పడుతున్న ఇబ్బందుల ఇతివృత్తంతో సినిమాను తీసినట్లు డైరెక్టర్ తెలిపారు. ఈ సినిమాను యువత ఆదరించాలని కోరారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

### పోరంకిలో భూములపై ఆర్డీఓ విచారణ

**పెనమలూరు:** పోరంకిలో భూములపై ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 423/1, 423/2, 423/4లో 10.54 ఎకరాల భూమి ఉంది. అయితే ఈ భూములు ఇనామ్ భూములని ప్రైవేటు వ్యక్తుల చేతులు మారాయని వివాదం తలెత్తింది. శ్రీవసంతవేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామివార్ల దేవస్థానాలకు చెందిన భూములని దేవాదయ శాఖ అధికారులు వాదిస్తున్నారు. తాము చాలా సంవత్సరాల క్రితం ఈ భూములు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకుని పన్నులు చెల్లిస్తున్నామని నివాసితులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆలయ భూమిని స్వాధీనం చేయాలని ఆర్డీఓకు దేవాదయ అధికారులు అప్పీల్ పిటీషన్ ఆర్డీఓకు ఇవ్వటంతో దీనిపై విచారణ చేపట్టారు. ఈ మేరకు నివాసితులకు ఆర్డీఓ విచారణకు నోటీసులు ఇచ్చారు. అత్యంత విలువైన ఈ భూములపై అధికారులు విచారణ చేసి తుది నివేదిక ఇవ్వాల్సి ఉంది.

### సమస్యల పరిష్కారానికే 'స్పందన'



**విజయవాడరూరల్:** స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.సాయిశ్రీనివాసనాయక్, ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంగనాథ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్‌సింగ్, పీఆర్ అసిస్టెంట్ ఇంజినీర్ శివరామకృష్ణ, మండల సర్వేయర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### బాలఏసుకు దివ్యపూజాబలి



**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** స్థానిక జ్యోతినగర్‌లోని ఆర్సీఎం చర్చిలో దివ్య బాలఏసు మహోత్సవాలు రెండో రోజైన సోమవారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలను విజయవాడ సెయింట్ ఆంబ్రోస్ మేత్రాసనం వైస్ రెక్టార్ ఫాదర్ మహేష్ ఆధ్వర్యంలో బాలఏసుకు ఘనంగా దివ్యపూజాబలి సమర్పించారు. జ్ఞానం, ప్రేమ, ఐశ్వర్యం అనే అంశాలపై ఫాదర్ మహేష్ ప్రసంగించారు. జేఎంజే సిస్టర్స్ బాలఏసు గీతాలను ఆలపించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫాదర్లు పీకే జోసఫ్, చేబ్రోలు జోసఫ్ తంబి, సిస్టర్స్ ఆంథోనమ్మ, మంజుల, మేరీ, బాల పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

**పెనమలూరు:** తాడిగడప సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం కానూరు 100 అడుగుల రోడ్డులో జి.కుమారి భర్త సుందర్‌రావుతో కలిసి ఉంటుంది. భర్త వాచ్‌మెన్ ఉద్యోగం చేస్తాడు. అయితే కుమారి మందులు కొనటానికి తాడిగడప సెంటర్‌కు వచ్చి మందులు కొని ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా ఆమెను ఎదురుగా మచిలీపట్నం వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలు అవ్వటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

# నిర్ణయాత్మక శక్తిగా అతివలు

● పెనమలూరులో మహిళ ఓటర్లే అధికం ● నేటి నుంచి జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు

**కంకిపాడు:** పెనమలూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ మేరకు తుది ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు ఇటీవల విడుదల చేశారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 7,265 మంది అధికంగా ఉన్నారు. దీన్ని బట్టి నిర్ణయాత్మక శక్తిగా అతివలు నిలుస్తున్నారు.

**మొత్తం మండలాలు మూడు..**


నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గం వ్యాప్తంగా 302 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మహిళా ఓటర్లు 1,40,947 కాగా, పురుష ఓటర్లు 1,33,682 మంది. ఇతరులు ఇద్దరు ఉన్నారు.

**ముసాయిదా జాబితా ఇలా..**

గతేడాది నవంబర్ 9న ముసాయిదా జాబితాను అధికారులు ప్రకటించారు. ఇందులో నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,73,487 మంది ఉన్నారు. మహిళలు 1,40,230 మంది, పురుషులు 1,33,255 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. పూర్తి స్థాయి విచారణ, తదుపరి ఓటర్ల నమోదు ప్రక్రియతో ఓటర్ల సంఖ్య 2,74,631గా తేలుస్తూ అధికారులు తుది జాబితాను వెలువరించారు.

**ప్రత్యేక కార్యక్రమాలు..**

ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం, బుధవారాల్లో నియోజకవర్గం వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, రంగవల్లులు, ఓటర్ల దినోత్సవం రోజు విజేతలకు బహుమతులు, కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేయటం, సీనియర్ ఓటర్లను సత్కరించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయి. ఈ మేరకు నియోజకవర్గం వ్యాప్తంగా ఓటర్ల దినోత్సవం విజయవంతం చేయాలని పెనమలూరు నియోజకవర్గ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీవీ సతీష్ తెలిపారు.



మండలాల వారీగా ఓటర్ల వివరాలు

| మండలం | పోలింగ్ కేంద్రాలు | పురుష ఓటర్లు | మహిళా ఓటర్లు | ఇతరులు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|---|
| పెనమలూరు | 164 | 78,253 | 81,706 | 1 | 1,59,960 |
| కంకిపాడు | 64 | 25,773 | 27,678 | 1 | 53,452 |
| ఉయ్యూరు | 74 | 29,656 | 31,563 | - | 61,219 |
| మొత్తం | 302 | 1,33,682 | 1,40,947 | 2 | 2,74,631 |

# పశుగణాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

ఎంపీపీ అనగాని రవి

**గన్నవరంరూరల్:** పశుగణాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి చెప్పారు. మండలంలోని కట్టుబడిపాలెంలో ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, కృష్ణామిల్క్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఉచిత పశువైద్య శిబిరం ముగింపు సభకు ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెటర్నరీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ మండా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషకులకు పాడి సంపద ఆర్థిక స్వావలంభనగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పాడి రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తుందన్నారు. వెటర్నరీ వైద్యులు సేవా భావంతో పని చేయాలని, మూగ జీవాలకు చేసే వైద్యం ఎంతో గొప్పదన్నారు. గ్రామాల్లో మూగజీవాలకు వైద్యం చేస్తూ, పశుపోషకులతో మంచి సంబంధాలను కలిగి ఉండాలని సూచించారు.

**నట్టల నివారణ మందు పంపిణీ**

కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ పాలడుగు నాని మాట్లాడుతూ.. గ్రామాల్లో పశు సంపద రక్షణకు, అభివృద్ధికి యూనియన్ చేపట్టిన చర్యలు వివరించారు. పశుగ్రాసం పెంచేందుకు సైతం పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. ఉచిత పశువైద్య శిబిరంలో 900 జీవాలకు నట్టల నివారణ మందులను, 95 పశువులకు చికిత్సలు చేశారు. ఏడీఏ కె.రాధాకృష్ణమూర్తి, వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పుగంటి రాజేష్, మిల్క్ యూనియన్ రూట్ మేనేజర్ తుమ్మల యశ్వంత్, డాక్టర్ సుధీర్ కుమార్, ఉపసర్పంచ్ కూచిపూడి కురేష్‌బాబు, కూచిపూడి నాని, ఎంపీటీసీ సభ్యుడు కొవ్వలి రాజు, కూచిపూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లలో సేవలందించిన వెటర్నరీ డాక్టర్లకు ఎంపీపీ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.



వెటర్నరీ డాక్టర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ అనగాని రవి, నాని తదితరులు

### వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్ - 3 ప్రారంభం

**కంకిపాడు:** అవ్వాతాతల కంటి సంరక్షణ ప్రభుత్వ లక్ష్యమని ఉప్పులూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ఈడుపుగల్లు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్–3 సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. డాక్టర్ సుందర్‌కుమార్ కంటి పరీక్షలను ప్రారంభించారు. 60 ఏళ్లు దాటిన 110 మంది వృద్ధులకు ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో 104 వైద్యుడు డాక్టర్ నిరంజన్, పీవీఆర్‌వీ ఆంజనేయులు, ఎంపీహెచ్ఎస్ టి.శ్యామల, సిబ్బంది ఝాన్సీకుమారి, అనిత పాల్గొన్నారు.



ఈడుపుగల్లులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు రాజేష్‌కుమార్, సుందర్‌కుమార్

# ఘనంగా నేతాజీ జయంతి

**పెనమలూరు:** కానూరులో మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవాసంఘ్ ఆధ్వర్యంలో ఆజాద్ హిందూఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 126వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్ మాట్లాడుతూ.. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ భారతదేశ స్వాతంత్య్రం కోసం బ్రిటీష్ పాలకులతో రాజీలేని పోరాటం చేశారన్నారు. నేటి యువత నేతాజీ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్, పలువురు ప్రముఖులు, బాడీబిల్డింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

**సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో..**

కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో నేతాజీ జయంతి విద్యార్థులు ఘనంగా జరిపారు. నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరాక్రమ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీ డీన్ బావినేని పాండురంగారావు మాట్లాడుతూ.. క్రమశిక్షణ, దేశభక్తికి మారు పేరు నేతాజీ అన్నారు. విద్యార్థులు నేతాజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ బి.వినోద్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆదర్శప్రాయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్**

**కంకిపాడు:** భారత స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి తరానికి ఆదర్శప్రాయులని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు అన్నారు. మండలంలోని మంతెన గ్రామంలోని బోసు బొమ్మ సెంటరులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి సుబ్బారావు, పలువురు స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత తొలి ఆర్మీని సిద్ధం చేసి, ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటుచేసిన, ఉన్నత భావాలు గల మహనీయుడు సుభాష్‌చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు మేడంకి బాబీ, కొండేటి శ్రీనివాసరావు, వడ్లమాటి తిరుపతయ్య, వి.రాజారావు, నాగదేశి బాల, మల్లవరపు రాజేష్, మాదు వెంకటేశ్వరరావు, ఎం.బాబూరావు పాల్గొన్నారు.

**జంక్షన్‌లో వేడుకలు..**

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ సాగించిన పోరాటం చిరస్మరణీయమని సమరసతా సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ఎదురువాడ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని ఆయన కార్యాయలంలో నేతాజీ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. తొలుత సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి బ్రిటీష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టేందుకు సుభాష్‌చంద్రబోస్ చూపిన తెగువ సాహసోపేతమని కొనియాడారు. నేతాజీ జయంతిని కేంద్ర ప్రభుత్వం పరాక్రమ్ దివాస్‌గా ప్రకటించటం హర్షణీయమన్నారు. సమరసతా ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు, యునైటెడ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు భాగ్యరాజు, నేహ మెడికల్స్ అధినేత కమ్మిలి సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

**సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి**

**గన్నవరం:** స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ విగ్రహానికి అసోసియేషన్ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శి చిప్పాడ చంద్రశేఖర్‌రావు, వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ఆర్‌కే ప్రసాద్, ముక్కామల సుబ్బారావు పూలమాలలు వేసి నివాళుర్పించారు. వాకర్స్ సభ్యులు వీసం ప్రసాదరావు, సగ్గుర్తి శ్రీనివాసరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక బోస్ బొమ్మ సెంటర్‌లోని విగ్రహానికి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చిమట రామారావు, దోణవల్లి నాగేశ్వరరావు నివాళులర్పించారు.



కానూరులో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్రీడాకారులు



మంతెనలో నివాళులర్పిస్తున్న కొండవీటి వెంకట సుబ్బారావు తదితరులు

# బాలికల విద్యకు ప్రాధాన్యత

**గన్నవరం:** బాలికల విద్యకు ఉన్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యుడు రాజేంద్ర పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. బాలికల విద్యకు ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహిస్తుందన్నారు. బాలల హక్కుల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని బాలల రక్షణ జిల్లా అధికారి వై.జాన్సన్ తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరామని, 18 ఏళ్లు దాటిన తర్వాతే ఆడపిల్లకు పెళ్లి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటలక్ష్మి చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న రాజేంద్ర

# జగనన్న కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

**ఉంగుటూరు:** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు సీఎం జగన్ ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. వెల్దిపాడులో జగనన్న కాలనీలో మండల పరిషత్ సాధారణ నిధులు రూ.2 లక్షలతో అంతర్గత రహదారి నిర్మాణానికి ఎంపీపీ సోమవారం శంకుస్థాపన చేశారు. జగనన్న కాలనీల్లో రహదారులు, డ్రెయినేజీలు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనను అధికారులు వేగవంతం చేయాలని సూచించారు.



రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సరోజిని

### రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



**గన్నవరం:** రాష్ట్ర స్థాయి స్కూలు గేమ్స్ అండర్–14, 17 ఫెన్సింగ్ పోటీలకు స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. విజయవాడలో జరిగిన సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన ఎం.అఖిల్, వి.దుర్గామహేష్, ఎస్.మహేశ్వర్, సిద్ధార్థ, కె.సమర్ధన్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరందరూ ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు డి.నాగరాజు పాల్గొన్నారు.

**రాంచంద్‌కు అభినందనలు**



**నున్న(విజయవాడరూరల్):** రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న దాసరి రాంచంద్ శ్రీఈశ్వర్ అండర్ - 17 విభాగంలో ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు కర్నూలులో జరిగే అండర్ - 17 రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థి పాల్గొంటారని తెలిపారు. సోమవారం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో రాంచంద్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

# వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



ఆధ్యాత్మిక ప్రవచనాలను అందిస్తున్న శివస్వామి



యనమలకుదురులో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**రామవరప్పాడు:** విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో శ్రీ వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 92 మంది మహిళలు కుంకుమ పూజలు, విశేష అభిషేకాలు చేశారు. ఈ పూజలకు కావాల్సిన పసుపు, కుంకుమ, కండువా వంటి తదితర పూజాద్రవ్యములను మహిళలకు సంఘ సభ్యులు ఉచితంగా అందజేశారు. అనంతరం శైవ క్షేత్ర పీఠాదిపతులు, భారత ధర్మ దేవత బిరుదాంకితులు శ్రీ శివస్వామి కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలను అందించారు. సమాజంలో ఆర్యవైశ్యులకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ పరివార్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా, వాసవీ సేవా సంఘం అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ గూడవల్లి నరసయ్య, నాయకులు సర్నాల బాలాజీ, శిఖాకొల్లి యల్లమందయ్య, పురిమి సుబ్రహ్మణ్యం, కోట రామకృష్ణారావు, మాదాల వెంకట రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**యనమలకుదురులో..**

**పెనమలూరు:** యనమలకుదురు గ్రామంలో సోమవారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ, విశ్వరూప దర్శన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, 108 మంది కన్యలచే కలశ ఆరాధన, అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం, ఉదయం 10 గంటలకు లక్ష కుంకుమార్చన, గణపతి నవగ్రహ హోమం, వాసవీ అమ్మవారికి మంత్రహోమం చేశారు. అనంతరం భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గ్రామంలో అమ్మవారిని రథంపై ఉంచి గ్రామోత్సవం చేశారు. విద్యుత్ దీపాలంకరణతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

**వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని స్థానిక ఏలూరురోడ్డులోని వాసవీ మాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, బియ్యంతో విశేష అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శాంతిహోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా తవ్వా పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడు బొమ్మిశెట్టి రామారావు, ప్రధాన కార్యదర్శి తవ్వా వెంకట రామారావు, కోశాధికారి శ్రీధర శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధి నిమిత్తం నూతన కమిటీ అధ్యక్షుడు తవ్వా పూర్ణచంద్రరావు రూ.1,11,116 విరాళంగా అందజేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పైడి సుధాకర్, ఎంపీటీసీ సభ్యుడు కొనకళ్ల వెంకటేశ్వరరావు, సంఘస్తులు పాల్గొన్నారు.

### గన్నవరంలో విశేష పూజలు..

**గన్నవరం:** స్థానిక బుద్ధవరం రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలోని మందిరంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ పర్వదినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అమ్మవారికి సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, నవకలశ ఆరాధన జరిపారు. అనంతరం వాసవీ మాతకు గో క్షీరాభిషేకం, విశేష అలంకరణలు, శాంతి హోమం, పూర్ణాహుతి సమర్పణ, నీరజన మంత్ర పుష్ప పూజలు నిర్వహించారు. భక్తులు పసుపు, కుంకుమ, గంధం, రవికుల వస్త్రం, కాటుక, తిలకం, గాజులు, బియ్యం, ఎండుకొబ్బరి, పెసరపప్పు, తాంబూలంతో కూడిన ఒడిబాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకుడు పవనాచార్యులు నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు శ్రీకాకుళపు సత్యనారాయణ, కందగడ్డల కృష్ణారావు, కంచర్ల శివనాగేశ్వరరావు, కుర్మాల సత్యశ్రీనివాస్‌కుమార్‌గుప్తా, బొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, గొంట్ల యజ్ఞనారాయణ, మదుపల్లి బాలకృష్ణమూర్తి, తాడికొండ ప్రసాద్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.



అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబాల

# మార్కెట్‌లోకి కొత్త హ్యూందాయ్ కార్లు

**రామవరప్పాడు:** హ్యూందాయ్ కార్ల శ్రేణిలో నూతన మోడల్స్ న్యూ ఆరా, న్యూ గ్రాండ్ ఐ 10 కార్లను రామవరప్పాడులోని సాయి స్వర్ణ హ్యూందాయ్ కార్ల షోరూమ్‌లో సోమవారం గవర్నర్‌పేట ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కె.రమేష్‌బాబు లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూమ్ జనరల్ మేనేజర్ భగత్‌సింగ్ మాట్లాడుతూ.. ఈ రెండు కొత్త మోడల్ కార్లు ఆరు రంగుల్లో అందుబాటులో ఉన్నాయని, అనేక ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. న్యూ ఆరా మోడల్ ప్రారంభ ధర రూ 6.29 లక్షలు, గ్రాండ్ ఐ 10 నియోస్ కారు ప్రారంభ ధర రూ.5.69 లక్షలన్నారు. షోరూమ్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



కార్లను ఆవిష్కరిస్తున్న రమేష్‌బాబు

# సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

**కంకిపాడు:** సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో సోమవారం మినుము, పెసర పొలాలను వ్యవసాయాధికారుల బృందం రైతులతో కలిసి సోమవారం పరిశీలించారు. మినుము, పెసర పొలాల్లో మంచు కారణంగా బూడిద తెగులు, తుప్పు తెగులు గుర్తించామన్నారు. ఏఓ కిరణ్ మాట్లాడుతూ తుప్పు, బూడిద తెగులు వ్యాప్తి చెందకుండా, ముందస్తు జాగ్రత్తగా సాఫ్ 100 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. తక్కువ ఉధృతి ఉంటే ఇండెక్స్ ఎకరాకు 100 గ్రాములు చొప్పున లేదా ఎం-45 ఎకరాకు 250 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. ఉధృతి ఎక్కువగా ఉంటే కస్టోడియ 300 మి.లీ. ఎకరాకు, లేదా ఆమిస్టర్ టాప్ 200 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. సస్యరక్షణ చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.

# పైపులైను పనుల పరిశీలన

**నున్న(విజయవాడరూరల్):** నున్న జగనన్న కాలనీలో జలజీవన్ మిషన్ నిధులు రూ.17 లక్షలతో నిర్మించిన పైపులైను నిర్మాణం పనులను క్వాలిటీ కంట్రోల్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిమోహన్ సోమవారం పరిశీలించారు. జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల కోసం రెండు బోరులు నుంచి 35 తాత్కాలికంగా ట్యాప్ కనెక్షన్లు ఇచ్చారు. దానికి సంబంధించిన పైపులైను నిర్మాణం పనులను ఏఈ శ్వేత, ఇంజినీరింగ్ అసిస్టెంటు రాజుతో కలిసి ఆ పనులను డీఈఈ పరిశీలించారు.

### ఇందుపల్లి రైల్వే గేటు మూసివేత

**ఉంగుటూరు:** తేలప్రోలు - ఉయ్యూరు ప్రధాన రహదారిలో ఇందుపల్లి వద్ద ఉన్న రైల్వే గేటు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు గుడివాడ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతులకు మూడు రోజులు గేటు మూసి వేస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.